## సెల్ ఫోన్ల అందజేత



సెల్ ఫోన్ అందజేస్తున్న పట్టణ సీఐ శంకరయ్య

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5 : కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు వారు పోగొట్టుకున్న సెల్ ఫోన్లను శుక్రవారం అందించినట్లు పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. డాక్టర్ కర్రే వెంకటేశ్, రవికుమార్, మధు శైలేంద్ర సెల్ ఫోన్లు పోయినట్లు అందిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి, బాధితులకు అందించినట్లు పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోన్స్ పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ నవీన్‌కు సీఐ శంకరయ్య ప్రత్యేకంగా అభినందించారు.

## ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5 : కాగజ్‌నగర్ మండలం నాగంపేట పంచాయతీ పరిధిలో ఎస్పీఎం, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గువ్వాలగూడ, నాగంపేట, జంబుగా, గజ్జీగూడ, బోడగూడ తదితర గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ భాను ప్రకాశ్ పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్‌కుమార్, రేఖ, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

## చోరీ నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ అల్లం నరేందర్

దండేపల్లి, ఏప్రిల్5: దండేపల్లి మండల కేంద్రంలోని మాలగాని మల్లన్న గుడిలో గురువారం జరిగిన దొంగతనం, అదే రోజు అంబేద్కర్ చౌరస్తాలో షేక్ హాజీకి చెందిన ఆటో ట్రాలీ దొంగతనం కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ అల్లం నరేందర్ తెలిపారు.శుక్రవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు.శుక్రవారం గూడెం చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఆటోలో వచ్చిన వ్యక్తులను పట్టుకున్నామన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపెల్లి మండలం రేకూర్తి గ్రామానికి చెందిన తూర్పాటి కనకయ్య, కరీంనగర్ హనుమాన్‌నగర్‌కు చెందిన పత్తి కనకరాజు అనే ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఆటో ట్రాలీ, మల్లన్న గుడిలో చోరీ చేసిన సొత్తు, బైక్ స్వాధీనం చేసుకొని వారిద్దరిని అరెస్ట్ చేసి జైలుకు పంపించామన్నారు.



కెరమెరి : జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు



కాగజ్‌నగర్ : చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీనియర్ సిటిజన్ నాయకులు



జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు

# జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

- అణగారిన వర్గాల అభ్యుదయానికి అలుపెరుగని కృషి
- కొనియాడిన అధికారులు, నాయకులు
- ఘనంగా జగ్జీవన్‌రామ్ 117వ జయంతి
- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కూడళ్లలో ఘనంగా నివాళి

*స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని పలువురు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కూడళ్లు, చౌరస్తాల్లో అధికారులు, నాయకులు, ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, నాయకులు మాట్లాడారు. అణగారిన వర్గాల అభ్యుదయానికి అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. ఉప ప్రధానిగా, కేంద్ర మంత్రి పదవుల్లో ఉంటూ తన విధులను ఎంతో బాధ్యతగా నిర్వర్తించేవారని పేర్కొన్నారు.*



ఆసిఫాబాద్ టౌన్ : చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

### జిల్లా కేంద్రంలో..

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 5 : జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ భుజంగ రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కర్ణ గౌడ్ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని గురుకులాలు, తదితర ప్రభుత్వ కార్యాలలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సంతోష్, నాగేందర్, వంశీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గుర్రాల వెంకటేశ్వర్లు, పద్మ పాల్గొన్నారు.

### కెరమెరిలో..

కెరమెరి, ఏప్రిల్ 5 : కెరమెరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణారావు, తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహ్మద్ అమ్జద్, పంచాయతీ కార్యదర్శి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

### కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్, ఏప్రిల్ 5 : పట్టణంలోని సర్‌సిల్క్ చౌరస్తాలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటూకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్ భవనంలో ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ప్రతినిధులు ఎనగంటి భిక్షపతి, శ్రావన్‌కుమార్, రతన్ గైన్, హనుమంతు, రాకేశ్, యాదగిరి, వసంత్, రమేశ్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సంఘం ప్రతినిధులు రమణయ్య, ఫారుఖ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని చింతగూడ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, నాయకులు కొంగ సత్యనారాయణ, ఈర్ల విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### రెబ్బెనలో..

రెబ్బెన, ఏప్రిల్ 5 : రెబ్బెన మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో రెబ్బెన జడ్పీటీసీ వేముర్ల సంతోష్, మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, నాయకులు గోగర్ల రాజేశ్, అరికిళ్ల స్వామి, దుర్గం రాజేశ్, చిలుముల నర్సింహులు, అశోక్, శంకర్, ధర్మయ్య తదితరులు

### చింతలమానేపల్లిలో..

చింతలమానేపల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని తహసీల్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజ్ గౌడ్, డీటీ భీమ్లా నాయక్ జాఫర్, జలేందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సిర్పూర్(టీ)లో..

సిర్పూర్(టీ), ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీడీవో సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### లింగాపూర్‌లో..

లింగాపూర్, ఏప్రిల్ 5 : లింగాపూర్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఆర్ బాపురావు, కారోబారి జాదవ్ విజేశ్, రాథోడ్ నరేశ్, సిడాం దత్తు పాల్గొన్నారు.

### కౌటాలలో..

కౌటాల, ఏప్రిల్ 5 : మండల కేంద్రంలోని తలోడి చౌరస్తాలో గల జగ్జీవన్ రాం విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఉపాధి హామీ పనుల వద్ద, పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సాయికృష్ణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నక్క శంకర్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మండల నాయకులు, కార్యకర్తలు, కూలీలు పాల్గొన్నారు.



రెబ్బెన : రెబ్బెనలో జడ్పీటీసీ వేముర్ల సంతోష్



చింతలమానేపల్లి : నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నాగరాజ్‌గౌడ్..



సిర్పూర్(టీ) : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ..

# నేరాల నియంత్రణలో భాగస్వాములవ్వాలి

- ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 5 : నేరాల నియంత్రణలో రౌడీ షీటర్లు భాగస్వాములవ్వాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో శుక్రవారం సబ్‌డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్లలో మార్పు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో జీవనం కొనసాగించాలని సూచించారు. ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో ఉంటే రౌడీ షీటర్ ఎత్తివేస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరస్తులు తొందర పాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ దర్యాప్తు పద్ధతులతో ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నదని తెలిపారు. నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోవడం అసాధ్యమన్నారు. నేరం చేసే ముందు తమ పిల్లల జీవితం గురించి ఆలోచించాలని సూచించారు. రౌడీ షీటర్ ఉన్న ప్రతి ఒక్కరిపైనా ప్రత్యేక బృందాల ద్వారా నిఘా ఉంచామన్నారు. భూ కబ్జాలు, ప్రజలను బయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. నేర ప్రవృత్తిని మార్చుకునేందుకు ఒక అవకాశం ఇస్తున్నామన్నారు. మారకపోతే కఠినంగా వ్యవహరించవల్సి వస్తుందని హెచ్చరించారు. పదేండ్ల నుంచి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీటర్ తొలగించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ పట్టణ సీఐ సతీశ్, వాంకిడీ సీఐ శ్రీనివాస్, ఆసిఫాబాద్, రెబ్బెన ఎస్‌ఐలు ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు యువకుల ఆత్మహత్య..

- ఒకరు మద్యానికి బానిసై.. మరొకరు భార్య కాపురానికి రాలేదని..

సిర్పూర్(టీ), ఏప్రిల్ 5 : ఒకరు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకోగా, మరొకరు భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నారని సిర్పూర్(టీ) ఎస్‌ఐ దీకొండ రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కామ్టే ప్రవీణ్ (24) కొంత కాలంగా మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఎలుకల మందు తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి కడుపునొస్తున్నదని చెప్పాడు. ఏమైందని ప్రశినంచడంతో ఎలుకల మందు తాగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు వెంటనే సిర్పూర్(టీ) సామాజిక దవఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా, వేంపల్లి గ్రామ సమీపంలో మృతి చెందాడు.

### భార్య కాపురానికి రాలేదని...

చింతకుంటకు చెందిన కోట శ్రీశైలం (30)కు భూపాలపట్నం గ్రామానికి చెందిన సరితతో 3 ఏండ్ల క్రితం వివాహమైంది. ఒక కొడుకు. ప్రస్తుతం భార్య 9 నెలల గర్భిణి. భార్యాభర్తల మధ్య 4 నెలల క్రితం చిన్న గొడవలు జరగడంతో సరిత పుట్టింటికి వెళ్లింది. అప్పటినుంచి కాపురానికి రాలేదు. ఈ విషయంపై పెద్దమనుషుల పంచాయతీ పెట్టినా, భార్య రాకపోవడంతో మనస్థాపానికి గురై, మద్యానికి బానిసయ్యాడు. గురువారం తన సమీప బంధువు రిసెప్షన్‌కు వెళ్లాడు. అక్కడ అందరూ ఫొటోలు దిగడంతో తన భార్య కూడా తనతో ఉంటే బాగుండునను కొని తీవ్ర మనస్థాపం చెందాడు. రాత్రి సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## వాగులో పడి వలస కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 5 : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం చౌలమద్ది పెద్దవాగులో ప్రమాదవశాత్తు పడి ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకా రం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన పూజారి శ్రీనివా స్(30) చౌలమద్ది పెద్దవాగుపై వం తెన పనులు చేసేందుకు వలస వచ్చాడు. శుక్రవారం స్నానం చేస్తుండగా, ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రెబ్బెన, ఏప్రిల్ 5 : రెబ్బెన మండలం కొండపల్లి గ్రామానికి చెందిన గుర్లే పోశం(27) శుక్రవారం తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెబ్బెన ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పోశం కూలీ చే సుకుంటూ బతికేవాడు. గతేడాది కెరమెరి గ్రామానికి చెందిన దీపతో వివాహం అయ్యింది. ఇటీవల ఇరువురి మధ్య తరుచుగా చిన్న చిన్న గొడవలు జరిగాయి. 2వ తేదీన భార్యాభర్తల మధ్య గొడవ కావడంతో దీప పుట్టింటికి వెళ్లింది. మనస్థాపం చెందిన పోశం శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకునానడు. పోశం తల్లి గుర్లే మెండుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ పెర్కొన్నారు.

## ఉపాధి కూలీలకు సౌకర్యాల కల్పన

వాంకిడి, ఏప్రిల్ 5 : ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వాంకిడి పంచాయతీలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల్లో కూలీలకు కార్యదర్శి శివకుమార్ శుక్రవారం తాగునీరు, టెంట్ ఏర్పాటు చేశారు. అలాగే కూలీలకు(ఓఆర్‌ఎస్)ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



టెంట్, తాగునీరు ఏర్పాటు చేసి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న కార్యదర్శి శివకుమార్

## ప్రతిభా పరీక్షల్లో
# చెన్నూర్ విద్యార్థులకు అవార్డులు

చెన్నూర్, ఏప్రిల్ 5: సూచిర్ ఇండియా ఫౌండేషన్ వారు సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డ్స్ కోసం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షల్లో చెన్నూర్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారు. పట్టణంలోని న్యూలయోల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్ మోక్ష, పీ శ్రీలక్ష్మి, రైజింగ్ సన్ పాఠశాలకు చెందిన విద్యార్థి జేగాటి ప్రణీత్ విజేతలుగా నిలిచారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్డీడీవో సీఈవో జీ సతీశ్‌రెడ్డి, సినీ గేయ రచయిత చంద్రబోస్, సూచిర్ ఇండియా సంస్థ అధ్యక్షుడు వై కిరణ్, మంచిర్యాల జిల్లా కో-ఆర్డినేటర్ పుప్పాల ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగ అవార్డులు అందుకున్నారు.22 సంవత్సరాలుగా విద్యారంగంలో అందిస్తున్న సేవలకుగాను పట్టణంలోని రైసింగ్ సన్ పాఠశాల కరస్పాండెంట్ ఖాజా ఖంరొద్దీన్‌కు గురుఃబ్రహ్మ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

## పశువుల దప్పిక తీర్చేందుకు నీటి తొట్టె ఏర్పాటు

దండేపల్లి, ఏప్రిల్ 5 :మండుతున్న ఎండలకు మనుషులే కాదు పశువులు అల్లాడుతున్నాయి. చాలా గ్రామాల్లో నీటి వనరుల్లో నీరు ఇంకిపోవడంతో దాహం తీర్చుకునేందుకు పశువులు ఇబ్బంది పడుతున్నాయి. వేసవిలో పశువుల దాహార్తి తీర్చడానికి వెల్గనూర్‌కు చెందిన రైతులు ఒక్కటయ్యారు. తలా కొంత పోగుచేసి రూ.40వేల వ్యయంతో నీటి తొట్టె నిర్మించుకున్నారు.తొట్టె నిర్మించి అందులో నీళ్లు నింపి ఉంచడంతో పశువులు అక్కడికి చేరుకొని దాహాన్ని తీర్చుకుంటున్నాయి.



నీటి తొట్టె వద్ద రైతు సంఘ నాయకులు

## ఓరియంట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కాసిపేట, ఏప్రిల్ 5 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీ ప్రెసిడెంట్ సత్యబ్రత శర్మ, యూనిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి నేతృత్వంలో ఓరియంట్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులతో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈసీజీ మిషన్, కరెంట్ బ్యాకప్ బ్యాటరీలు, వీల్ చైర్, స్ట్రెచర్, 10 బీపీ మిషన్స్, ఆర్వో వాటర్ ప్లాంట్ అందించారు. దేవాపూర్ పంచాయతీలోని ప్రభుత్వ వెల్‌నెస్ సెంటర్‌లో వాటర్ స్టోరేజ్ బ్యాంక్, రోగులకు పరుపులు, మెత్తలు, బెడ్ షీట్లు, స్టూల్స్, చెకింగ్ స్క్రీన్ అందించారు. దేవాపూర్ ప్రభుత్వ హైస్కూల్‌కు బోర్ పంపు, ఆర్వో వాటర్ ప్లాంట్, వాటర్ స్టోరేజ్ ట్యాంకులు, యూరినల్ బేసిన్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఓరియంట్ కంపెనీ లైజనింగ్ ఆఫీసర్ తిరుపతి, ఓరియంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All
CHANGE OF NAME
★I, PEASARA SAI GNANESHWAR, R/o. 1-64, New Sangvi Mamda, Adilabad, Nirmal-504 310, TS. Changed My Name as PICHARI SAI GNANESHWAR.
NT-328965
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677